dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ | 16 శుక్రవారం, అక్టోబర్ 2026







## లయన్స్ క్లబ్ ఆఫ్ శాతవాహన వాకర్స్ నూతన కార్యవర్గం

**కరీంనగర్ డీసీ**




కరీంనగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ శాతవాహన వాకర్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలోని శ్రీనిధి చిట్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకార వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ 320జి డిస్ట్రిక్ట్ గవర్నర్ మోర భద్రేశం ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా 40 లక్షల మంది సభ్యులతో లయన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన కొనియాడారు.

**నూతన కార్యవర్గ వివరాలు:**

అధ్యక్షుడు: మాదా సురేందర్
కార్యదర్శి: గుండు నరసయ్య
కోశాధికారి: వేములవాడ కనకాచారి
ఉపాధ్యక్షులు (వైస్ ప్రెసిడెంట్): పి. అంజయ్య
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్: కనుకుంట్ల భాస్కర్
సర్వీస్ చైర్‌పర్సన్: జీవనజ్యోతి
మార్కెటింగ్ చైర్‌పర్సన్: చంద్రశేఖర్
మెంబర్‌షిప్ చైర్‌పర్సన్: గాలిపల్లి లక్ష్మణ్
డైరెక్టర్: స్రవంతి లక్ష్మయ్య

ఈ కార్యక్రమంలో సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుంటుక చంద్రప్రకాష్, పిడిజి చిదుర సురేష్, రీజియన్ చైర్‌పర్సన్ ఆర్.ఎస్.పి. రెడ్డి, జోన్ చైర్‌పర్సన్ మనువాడ శంకర్, గోల్డెన్ శాతవాహన అధ్యక్షులు ననువాల గిరిధర్ రావు, సెక్రటరీ పాశం నరసింహారెడ్డి, ట్రెజరర్ చిలుపూరి రాములు, పాస్ట్ ప్రెసిడెంట్ అక్కనపల్లి అజయ్ కుమార్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.




| వస్తువు | తులం ధర | 10 గ్రా॥ ధర |
|---|---|---|
| ంగారం ధర 999 | 173620 | 148850 |
| ండి ధర 999 | 2531 | 2170 |
| ర్నమెంట్ ధర (10%) తరుగు | | 138430 |

## నిరుద్యోగులకు తీపి కబురు: గల్ఫ్ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు!

- దరఖాస్తులను ఆహ్వానిస్తున్న 'టామ్‌కామ్'
- వెల్లడించిన పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్

**పెద్దపల్లి డీసీ :**

రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ పరిధిలో పనిచేస్తున్న 'తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్' (TOMCOM) ఆధ్వర్యంలో పలు గల్ఫ్ దేశాల్లో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన అర్హత, అనుభవం ఉన్న అభ్యర్థులు ఒమన్, బహ్రెయిన్, యూఏఈ (అబుదాబి), కువైట్ మరియు ఖతార్ దేశాల్లోని వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**ఖాళీలు -- విద్యార్హతల వివరాలు:**

ఒమన్: అగ్రికల్చర్ వర్కర్ పోస్టులకు 10వ తరగతి, ఇంటర్మీడియట్ లేదా డిప్లొమా ఉంటే సరిపోతుంది.

బహ్రెయిన్: లాస్ రికవరీ సూపర్‌వైజర్ పోస్టుకు ఏదైనా గ్రాడ్యుయేషన్ (డిగ్రీ) ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

యూఏఈ (అబుదాబి): పైప్‌లైన్ రిపేర్, ఇంటెగ్రిటీ ఎక్విప్‌మెంట్ విభాగాల్లో ఖాళీలకు బి.ఇ (మెకానికల్) తో పాటు డ్రిల్లింగ్, డౌన్‌హోల్, కంప్లీషన్ టూల్స్‌లో అనుభవం తప్పనిసరి.

కువైట్: సూపర్‌వైజర్, కెమిస్ట్ ఉద్యోగాలకు బి.ఎస్సీ లేదా సంబంధిత డిప్లొమా విద్యార్హత ఉండాలి.

ఖతార్: నర్స్ టెక్నీషియన్, లైసెన్స్‌డ్ ప్రాక్టీషనర్ నర్స్ పోస్టులకు నర్సింగ్ విద్యార్హతతో పాటు అవసరమైన ప్రొఫెషనల్ లైసెన్స్ కలిగి ఉండాలి.

**హెల్ప్‌లైన్ నంబర్లు:**

ఉద్యోగాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం టామ్‌కామ్ అధికారిక హెల్ప్‌లైన్ నంబర్లు 08035524946, 040-23342040 లను సంప్రదించవచ్చని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి రాజశేఖర్ కోరారు.

dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ | 16 శుక్రవారం, అక్టోబర్ 2026




# బొమ్మకల్‌లో సద్దుల బతుకమ్మకు ఘనంగా ఏర్పాట్లు

- మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు
- పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు

**కరీంనగర్ డీసీ :**

తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమైన బతుకమ్మ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బొమ్మకల్ గ్రామంలో నిర్వహించనున్న ఏడు రోజుల సద్దుల బతుకమ్మ సంబరాల ముందస్తు ఏర్పాట్లను గురువారం ఆయన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఏర్పాట్ల విశేషాలు:**

రూ. 2.80 కోట్ల నిధులు: నగరపాలక సంస్థ వ్యాప్తంగా బతుకమ్మ ఘాట్ల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రూ. 2.80 కోట్లు వెచ్చిస్తున్నట్లు మేయర్ తెలిపారు.

భద్రత & విద్యుత్ దీపాలు: మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు ఘాట్ల వద్ద బారికేడ్లు మరియు భారీ విద్యుత్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.



పారిశుద్ధ్యం & తాగునీరు: పండుగ రోజుల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల వెంకటేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సౌదీ అరేబియాలో విషాదం: జగిత్యాల జిల్లా యువకుడు మృతి

-- జిజాన్ ప్రాంతంలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కాశిరెడ్డి రాకేష్

-- భౌతికకాయం స్వగ్రామానికి రప్పించేందుకు ప్రవాస సంఘాల లీడర్ల యత్నం

**జగిత్యాల డీసీ :**

సౌదీ అరేబియాలో జరిగిన ఘోర ప్రమాదంలో జగిత్యాల జిల్లాకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఉపాధి కోసం వెళ్లిన చోట విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవ దంతో స్వగ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. కోరుట్ల మండలం యాకీనిపూర్ గ్రామానికి చెందిన కాశిరెడ్డి రాకేష్ సౌదీ అరేబియాలోని జిజాన్ ప్రాంతంలో రిగ్గర్‌గా (భారీ యంత్రాలు, బరువైన వస్తువులను ఎత్తే కార్మికుడిగా) పని చేస్తున్నాడు.

**ప్రమాదం జరిగిందిలా...**

విధుల్లో భాగంగా జీఆర్‌పీ పైపుల మార్గం వద్ద రాకేష్ పనిచేస్తున్న సమయంలో అకస్మాత్తుగా క్రేన్ ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో బరువైన పైపులు ఆయనపై పడటంతో రాకేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం అందింది.

**స్వదేశానికి మృతదేహం తరలింపునకు కృషి:**

ఈ విషాద వార్తను సౌదీలోని రాయికల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ మచ్చ (సౌదీ అరేబియా తెలుగు సంఘం రియాద్ అధ్యక్షుడు, శ్రీని హ్యూమానిటీ సర్వీస్ వాట్సాప్ (గ్రూప్ సభ్యుడు) గుర్తించి, వెంటనే భారతదేశంలోని రాకేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తెలుగు సంఘం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే, తెలంగాణ ప్రవాస భారతీయుల సలహా మండలి ఉపాధ్యక్షులు మందా భీమారెడ్డితో సమన్వయం చేస్తూ... రాకేష్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి రప్పించేందుకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం మరియు జెద్దాలోని భారత కాన్సులేట్ జనరల్ అధికారులతో శ్రీనివాస్ మచ్చ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు.